
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
ఆదివారం 17 ఆగస్టు 2025



హ్యాప్రీ బస్!

ఎన్నికలొస్తే ఎన్నో చెబుతారు. గెలిచాక అందరూ ఓడమల్లన్నలే! నాయకుల నాలుకలకు నరం ఉండదు. అయినా వాళ్లు మాత్రం అన్నేసి వేల కోట్లు ఎక్కడ నుంచి తెస్తారు. డబ్బులేమన్నా అచ్చేస్తారా?

.. ఇవి జనంలో ఉండే అభిప్రాయాలు.

అదిగదిగో.. మేం చెప్పలేదా.. చంద్రబాబువన్నీ అబద్ధాలే. సూపర్ సిక్స్ ఒక మోసం.

.. ఇవి జగన్ తరచూ గొంతు చించుకుని అరిచే మాటలు.

మరి నిజం ఏమిటి?

ఒక్కటొక్కటిగా చెప్పిన మాటలన్నీ నిజం అవుతున్నాయి. చంద్రబాబు హామీలన్నీ పట్టాలెక్కుతున్నాయి. తల్లికి వందనం అంటూ ఖాతాల్లో డబ్బులు పడుతున్నాయి. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందుతున్నాయి. రైతన్నలకు ఆర్థికసాయంతో తొలివిడత జమ అయ్యింది. తాజాగా శుక్రవారం సాయంత్రం నుంచి ఆడవాళ్లకు ఫ్రీబస్ మొదలైంది. ఈ ఉచిత ప్రయాణం ఒక సంచలనం. పట్టణాలపై బతుకు ఆధారపడిన గ్రామీణ శ్రామిక స్త్రీలకు ఒక వరం. వారి ఆనందం వర్ణనాతీతం.. అందుకు సాక్ష్యమే జిల్లా నలుమూలల నుంచీ ఆంధ్రజ్యోతి ప్రతినిధులు సేకరించిన ఈ మాటలు..

ఆంధ్రజ్యోతి - చిత్తూరు జిల్లా నెట్‌వర్క్

మహిళల్లో పొంగిపొర్లుతున్న సంతోషం

శ్రామిక స్త్రీలలో పెద్ద భారం దిగిన ఆనందం

రోజుకు రూ.12.60 లక్షల భారం

జిల్లాలోని చిత్తూరు-1, చిత్తూరు-2, పలమనేరు, పుంగనూరు, కుప్పం డిపోల నుంచి మొత్తం 461 బస్సులుండగా.. అంతరాష్ట్ర సర్వీసులు 72 మినహాయిస్తే 316 బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతిస్తున్నారు. జిల్లా బస్సుల్లో రోజుకు 1.31 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. రోజుకు రూ.42 లక్షల ఆదాయం ఆర్టీసీకి సమకూరుతోంది. 1.31 లక్షల మంది ప్రయాణికుల్లో 40 శాతం మహిళా ప్రయాణికులు ఉంటారు. 72 అంతరాష్ట్ర సర్వీసుల్లో 10 శాతం ప్రయాణిస్తారనుకుంటే, మొత్తంగా 30 శాతం మంది ఉచితంగా ప్రయాణిస్తారు. అంటే 40 వేల మంది మహిళలు రోజుకు ఉచితంగా ప్రయాణిస్తారని ఆర్టీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. వీరితో రోజుకు రూ.12.60 లక్షలు ఆర్టీసీకి నష్టం కలుగుతోంది. ఈ నష్టాన్ని కార్గో సేవలను విస్తృతం చేయడం, ఆర్టీసీ స్థలాలను లీజుకు ఇవ్వడం, ఆర్టీసీ కాంప్లెక్సుల్ని అద్దెలకు ఇవ్వడం ద్వారా పూడ్చుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఆటో ప్రయాణం తప్పినట్లే

నా పేరు ప్రశాంతి. ఊరు బంగారుపాళ్యం మండలంలోని రాగిమానుపెంట. బంగారుపాళ్యంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నా. రోజూ ఆటోకు రాను రూ.20, పోను రూ.20 ఖర్చవుతోంది. ఇకనుంచి ఆ ఖర్చు లేదు. నాకు వచ్చే రూ.8 వేల జీతంలో రూ.వెయ్యి మిగలడం అంటే అది చాలా పెద్ద మొత్తం. అన్నింటికన్నా భద్రతలేని ఆటో ప్రయాణం కూడా తప్పినట్లే కదా.



నెలకు రూ.1800 ఆదా

ఈమె పేరు విమల. బంగారుపాళ్యం మండలం ఈచినేరుపల్లె. బంగారుపాళ్యంలోని ఓ సూపర్‌మార్కెట్‌లో పనిచేస్తున్నారు. ఆదివారం సహా రోజూ పనిచేయడానికి రావాల్సిందే. రోజుకు రాను పోను రూ.60 చొప్పున 30 రోజులకు రూ.1800 ఖర్చయ్యేది. రూ.12 వేల జీతంతో పనిచేసుకునే ఆమెకు రూ.1800 మిగలడం అనేది చాలా పెద్ద విషయమని మురిసిపోతున్నారు. సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటామంటున్నారు.



ఫోన్‌లో ఆధార్ సరిపోదా?



నా పేరు సుమతి. గుడిపాల మండలం 197 రామాపురంలో చిన్న కిరాణా కొట్టు నడుపుకుంటున్నా. నిత్యం గుడిపాల, చిత్తూరుకు ప్రయాణించాల్సి ఉంటుంది. శనివారం హడావిడిలో ఆధార్‌కార్డు తెచ్చుకోలేదు. కండక్టర్ టికెట్ తీసుకోవాల్సిందే అన్నారు. సెల్‌ఫోనులో చూపించినా ఒప్పుకుంటే బాగుంటుంది.

నాలుగేళ్లు చీకూచింతా లేదు



నా పేరు లీల. ఐరాల మండలం వీఎస్ అగ్రహారం. స్థానికంగా కూరగాయల వ్యాపారం చేస్తున్న నేను రోజూ చిత్తూరుకు వచ్చి కూరగాయలు కొనుక్కుని వెళ్తాను. రానూ పోను రూ.60 ఖర్చవుతుంది. నెలకు రూ.1800, ఏడాదికి రూ.21,600 మిగిలినట్టే కదా ఇంక. మొదటిసారిగా శనివారం పాకాల మండలంలోని ఆనందగిరికి బస్సులో ఉచితంగా వెళ్లి స్వామిని దర్శించుకున్నా. ఇక నాలుగేళ్ల పాటు ఎలాంటి చీకూ చింత లేకుండా బస్సుల్లో ప్రయాణిస్తాను.

ఆర్టీసీకి మహిళల కొత్త నిర్వచనం

బైరెడ్డిపల్లె, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణసౌకర్యం కల్పించడంతో ఏపీఎస్ ఆర్టీసీకి మహిళలు కొత్త నిర్వచనాన్ని తీసుకురావడం చర్చనీయాంశమైంది. ఏపీఎస్ ఆర్టీసీ అంటే - ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ అని అందరికీ తెలిసిందే.అయితే ఇప్పుడు ఆర్టీసీబస్సుల్లో మహిళలకు ఉచితప్రయాణసౌకర్యం కల్పించడంతో ఎ అంటే - ఆడపడుచులు, పి అంటే - పైసాఖర్చు లేకుండా, ఎస్ అంటే - సంతోషంగా, ఆర్ అంటే- రాష్ట్రమంతటా, టి అంటే - తిరిగే ప్రయాణసౌకర్యం, సి అంటే - చంద్రబాబు కల్పించిన అవకాశం అనే నిర్వచనమిచ్చి చర్చించుకుంటున్నారు.

మరిన్ని సామాన్లు తెచ్చుకుంటా

ఈమె పేరు రీటా. నగరి మండలం పన్నూరు. చిన్నపాటి కూరగాయల కొట్టు నడుపుతున్నారు. వారానికి నాలుగుసార్లు కొట్టులోకి కావాల్సిన సరుకుల కోసం నగరికి వచ్చి పోతుంటారు. రోజుకు రూ.40 చొప్పున, వారానికి నాలుగు రోజులు రూ.160 మిగులుతోంది. నెలకు రూ.640 మిగలడంతో ఆ డబ్బుతో కొట్టులోకి మరిన్ని సరుకులు తీసుకెళ్తానంటూ ఆమె సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.



నాలాంటివారికి ఎంతో ఉపయోగం



నా పేరు దేవకి. పెనుమూరు మండలంలోని సీఎస్ అగ్రహారం. మా ఆయన చనిపోయాడు. నాకు ఇద్దరు పిల్లలు. వారిని పోషించుకోవడానికి రోజూ చిత్తూరు వచ్చి అక్కడి బెల్లం మండీలో కూలి పని చేసుకుంటా. రానూ పోను రోజుకు రూ.60చార్జీకి పెట్టుకోవాలి.రోజుకు రూ.350 కూలి వచ్చే నాకు రూ.60 మిగులడం అంటే ఎంతో సంతోషంగా ఉంది.

ఇంటికి ఖర్చు పెట్టుకుంటా



నా పేరు అరుణ. మాది సోమల మండలంలోని సూరయ్యగారిపల్లె. శనివారం ఉదయం సోమల నుంచి కల్లూరు వరకు ఉచిత బస్సులోనే ప్రయాణించా. 15 ఏళ్లుగా కల్లూరులోని కిరాణా కొట్టులో పనిచేసుకుంటున్నా. రోజూ ఉదయం వచ్చి సాయంత్రం ఇంటికి వెళ్లిపోతా. రానూపోను రూ.60 ఖర్చు. ఇదంతా మిగిలిపోతుంది. ఇంటికి ఖర్చు పెట్టుకుంటా.



వ్యవసాయం నుంచి పరిశ్రమల వైపు
పరుగులు పెడుతున్న ప్రగతి

ఎనిమిదోసారి కుప్పం ఎమ్మెల్యేగా గెలిచి, మూడోసారి ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన నారా చంద్రబాబు నాయుడు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. గతంలో వ్యవసాయం ఆయన ప్రథమ ప్రాధాన్యం. దేశ, విదేశీ సాంకేతికతను కుప్పానికి రప్పించి ప్రయోగాలు చేసిన ఆయన, ఈసారి పారిశ్రామికంపై దృష్టి పెట్టారు. కుప్పాన్ని గతంలా స్థానిక నేతల మీద వదిలేయకుండా అభివృద్ధి, పార్టీలను సమన్వయం చేసుకుంటూ కుప్పంలోనే ఇల్లు కట్టుకుని పర్యవేక్షిస్తున్నారు. భువనేశ్వరి పర్యటనలతో, ఎమ్మెల్సీ శ్రీకాంత్ సారథ్యం, కడా పీడీ వికాస్ మర్మత్ ప్రణాళికలతో తొలి ఏడాదిలో కుప్పంలో ఏం జరిగింది? ఏ పనులు .. ఏ స్థాయిలో ఉన్నాయి? కుప్పం ప్రోగ్రెస్ రిపోర్ట్..

- 6వ పేజీలో

మాట వినలేదని భార్య గొంతు కోసి చంపేశాడు

బంగారుపాళ్యం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తన మాట వినలేదని భార్యను గొంతు కోసి చంపేసి పరారైన యువకుడి ఉదంతమిది. పోలీసుల కథనం మేరకు.. బంగారుపాళ్యం మండలంలోని కొదలమడుగు గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన హరిబాబు నాలుగేళ్ల కిందట అదే గ్రామానికి చెందిన ప్రియాంక(21)ను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఓ కుమారుడు ప్రేమసాయి (2) వున్నాడు.అయితే కొన్ని రోజులుగా ప్రియాంక ఫోన్లో తరచూ చాటింగ్ చేయడం చూసి ఇంకెవరితోనైనా సంబంధం పెట్టుకుందేమోనన్న అనుమానంతో ఆమెను భర్త మందలించాడు.ఆమె మాట వినకపోవడంతో గ్రామంలో శుక్రవారం పంచాయితీ కూడా నిర్వహించారు. అయినా ఆమె తీరు మారకపోవడంతో శనివారం ఉదయం పుట్టింట్లో ఉన్న ప్రియాంక వద్దకెళ్లాడు. తన భార్యతో మాట్లాడాలని అత్తను బయటకు వెళ్లమన్నాడు. ఆమె బయటకు వెళ్లగానే తనవెంట తెచ్చుకున్న కత్తితో భార్య గొంతు కోసేశాడు. ప్రియాంక కేకలు వేయడంతో తల్లి పరుగున లోపలకు వచ్చేలోపే రక్తపుమడుగులో విలవిల్లాడుతూ ప్రాణాలు కోల్పోయింది. హరిబాబు అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికుల సమాచారంతో సీఐ శ్రీనివాసులు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని, విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రియాంక తల్లి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. కాగా, తల్లి చనిపోయిందని తెలియని రెండేళ్ల ప్రేమసాయి అమ్మా.. అమ్మా అంటూ ఏడుస్తుండటం స్థానికులను కంటతడి పెట్టించింది.



ప్రియాంక (ఫైల్ ఫొటో) - హరిబాబు - అమ్మకోసం రోదిస్తున్న ప్రేమ్‌సాయి

మాకు మర్యాద కావాలి

- జడ్పీ సమావేశంలో సభ్యుల డిమాండ్
- రోడ్ల పనులు పూర్తి చేయలేదని ఆగ్రహం



సమావేశ వేదికపై జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, చైర్మన్ శ్రీనివాసులు, జేసీ విద్యాధరి

చిత్తూరు రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి):మండలాల్లో అధికారులు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు కనీస మర్యాద కూడా ఇవ్వడం లేదని జడ్పీ సమావేశంలో సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.చిత్తూరులోని జడ్పీ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు మాట్లాడుతూ స్వాతంత్ర్య దిన వేడుకలకు కూడా అధికారుల నుంచి ఆహ్వానం లేదని, పంచాయతీల్లో సర్పంచ్‌ను ఏ ప్రభుత్వ కార్యక్రమాలకూ పిలవడం లేదని జేసీ, జడ్పీ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీడీవోలు ప్రోటోకాల్ పాటించడం లేదని, జడ్పీటీసీ, ఎంపీపీలకు కనీస మర్యాద కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు.సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ప్రోటోకాల్ పాటించని అధికారులపై ప్రివిలేజ్ కమిటీకి, స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.అన్నదాత సుఖీభవ చెక్కుల పంపిణీకి సంబంధించి వ్యవసాయశాఖ ఏడీ ఒకే రైతుకు సంబంధించిన చెక్కును తనతో పాటు ఇతరుల ద్వారా కూడా పంపిణీ చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.సత్యవేడు నియోజకవర్గంలోని నాగలాపురం-టీపీ కోట రోడ్డు ఆర్టీసీ బస్సులు కూడా వెళ్లలేనంత అధ్వాన పరిస్థితిలో ఉందన్నారు. ఈ మార్గంలోనే 3 ప్రభుత్వ పాఠశాలలున్నాయని, విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కేవీబీపురం మండలంలోని ఎగవపూడి , నారాయణవనం మండలంలోని తంబూరు, పాలమంగళం వంతెనలు భారీ వర్షాలు పడినప్పుడల్లా కొట్టుకుపోతున్నాయన్నారు.తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెట్టేస్తున్నారని, ఇకనైనా వంతెనల నిర్మాణంపై అధికారులు దృష్టి సారించాలన్నారు.నాగలాపురం నుంచి సురుటుపల్లె వెళ్లే మార్గంలో 3 కిలోమీటర్లు రోడ్డు వేయాల్సి వున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రైవేటు, నెట్‌వర్క్ ఆస్పత్రులకు కూడా 108, 102 సర్వీసుల సౌకర్యం కల్పించాలని సూచించారు.పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో నీటి సమస్య లేకుండా బోర్లన్నిటికి విద్యుత్ సౌకర్యం వెంటనే ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. కుప్పం జడ్పీటీసీ శరవణన్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా చిత్తూరు చర్చి వీధిలో ఉన్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయాన్ని నగరానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని సంతపేటకు మార్చడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. నారాయణవనంలో ఫీల్డ్ అసిస్టెంట్లు సక్రమంగా పనిచేయకుండా ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తున్నారని జడ్పీటీసీ సుమన్ ఆరోపించారు.శ్రీకాళహస్తి-పల్లం నడుమ సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డు గుంతలమయమై ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు.మదనపల్లె జడ్పీటీసీ ఉదయకుమార్ మాట్లాడుతూ తమ మండలంలో మూడేళ్ల క్రితం సుమారు 75 లింక్ రోడ్లు మంజూరైతే ఒక్క రోడ్డు పని కూడా పూర్తికాలేదన్నారు. రామసముద్రం మండలంలో 28 రోడ్లకు గ్రావెల్ వేసి వదిలేయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని జడ్పీటీసీ రామచంద్రా రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.శ్రీకాళహస్తి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల సెక్యూరిటీ దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డీఈవో వరలక్ష్మిని జడ్పీటీసీ వెంకట సుబ్బారెడ్డి కోరారు. రామకుప్పం మండలం ఆర్.నడింపల్లెలో స్కూల్ నిర్మాణానికి తాను భూమి కొని ఇచ్చానని జడ్పీటీసీ నితిన్ రాఘవ రెడ్డి తెలిపారు. అయితే ఇప్పుడు ఆ పాఠశాలను వేరే పాఠశాలతో కలిపేశారని, దీంతో ఆ గ్రామంలో ఉన్న విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని,ఇప్పుడు తాను కొనిచ్చిన భూమిని ఏం చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లకు వెళ్లి వైద్యం అందించాల్సిన ఆశా కార్యకర్తలు ఆ పని చేయడం లేదని, వైద్యం అందించాలని చెప్పిన ఏఎన్ఎంపై దాడికి పాల్పడుతున్నారని పాకాల జడ్పీటీసీ పద్మజా రెడ్డి ఫిర్యాదు చేశారు.దీంతో గర్భిణులు, వృద్ధులు వైద్యం అందక ఇబ్బంది పడుతున్నారన్నారు.పెద్దమండ్యంలో ట్యాంకుల ద్వారా నీళ్ల సరఫరా చేసిన బిల్లులు రెండేళ్లయినా మంజూరు కాకపోవడంతో, ట్యాంకర్ల యజమానులు తన ఇంటి వద్దకు వస్తున్నారని జడ్పీటీసీ పీరమ్మ ఆందోళన వ్యక్తం చేశారు.వ్యవసాయ సర్వీసులకు రెండు సంవత్సరాల క్రితం డబ్బులు కట్టినా ఇప్పటికీ కనెక్షన్లు ఇవ్వలేదనిఆమె ఆరోపించారు.తమ మండలంలోనే సుమారు 500 వ్యవసాయ సర్వీసులు పెండింగ్‌లో ఉన్నాయని విద్యుత్ శాఖ దృష్టికి తీసుకొచ్చారు. జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు తొలుత అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలతో సమావేశాన్ని ప్రారంభించారు. సభలో చర్చించిన విషయాలను జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జేసీ విద్యాధరి మీడియా సమావేశం నిర్వహించి వివరించారు.సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.



హాజరైన ఎమ్మెల్యేలు, సభ్యులు

మండలానికో ప్రత్యేక అధికారి

అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణకు నియామకం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించడానికి మున్సిపాలిటీ, మండలానికో జిల్లా సీనియర్ అధికారిని స్పెషలాఫీసరుగా నియమిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. వీరు తమకు కేటాయించిన మండలంలో అంగన్‌వాడీకేంద్రాలు, వసతిగృహాలు, పాఠశాలలు, తాగునీటి వనరులు, గ్రామ, వార్డు సచివాలయాలను క్షేత్రస్థాయిలో ప్రతి 15 రోజుల్లో రెండ్రోజుల పాటు తనిఖీలు చేసి.. జిల్లా యంత్రాంగం ఇచ్చిన ప్రొఫార్మా రూపంలో నివేదికను అందజేయాలి. దీంతోపాటు పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) అర్జీలపై గ్రామాల్లో ఆడిట్ కూడా చేయాలి. మండల స్థాయి అధికారులు వీరి పర్యటనల సమయంలో హాజరు కాకుంటే తగిన చర్యలు ఉంటాయని కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.మండలాల వారీగా అధికారులిలా..జీడీ నెల్లూరుకు డీఆర్డీఏ పీడీ, రామకుప్పానికి డ్వామా పీడీ, పూతలపట్టుకు ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్, శ్రీరంగరాజపురానికి పీఆర్ ఎస్ఈ, వి.కోటకు హౌసింగ్ పీడీ, పెనుమూరుకు జడ్పీ సీఈవో, యాదమరికి ఆర్అండ్‌బీ ఈఈ, వెదురుకుప్పానికి జిల్లా సర్వే అధికారి, ఐరాలకు బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, గంగవరానికి జిల్లా వాటర్ రిసోర్స్ ఆఫీసర్, నింద్రకు నగరి డీడీవో, పెద్దపంజాణికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, రొంపిచెర్లకు ఏపీఎంఐపీ పీడీ, కార్వేటినగరానికి జిల్లా గిరిజనసంక్షేమ అధికారి, పాలసముద్రానికి ఎస్ఎస్ ఏపీసీ, విజయపురానికి నగరి ఆర్డీవో, కుప్పం మున్సిపాలిటీకి లోకల్ ఆర్డీవో, పలమనేరుకు లోకల్ ఆర్డీవో, సదుంకు జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారి, బంగారుపాళ్యంకు జిల్లా పట్టుశాఖ అధికారి, చౌడేపల్లెకు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ, సోమలకు పరిశ్రమలశాఖ జీఎం, బైరెడ్డిపల్లెకు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్, గుడిపాలకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, పులిచెర్లకు దేవదాయశాఖ ఏసీ, చిత్తూరు నగరపాలకసంస్థకు లోకల్ ఆర్డీవో , తవణంపల్లెకు పట్టుశాఖ ఏడీ, నగరికి జిల్లా మైన్స్, జియాలజీ ఆఫీసర్, పుంగనూరుకు డీపీవో, కుప్పానికి ఏపీఐఐసీ జడ్ఎం, శాంతిపురానికి పీఆర్ డీఈఈ (కుప్పం), చిత్తూరుకు డిస్ట్రిక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (చిత్తూరు),గుడుపల్లెకు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ (కుప్పం), మున్సిపాలిటీల్లో నగరికి డీఎస్వో(చిత్తూరు), పలమనేరుకు మెప్మా పీడీ,పుంగనూరుకు జిల్లా సహకారశాఖఅధికారిని నియమించారు.

ప్రత్యేక కథనం - కుప్పం, ఆంధ్రజ్యోతి

1989లో చంద్రబాబు రాకతో కుప్పం నియోజకవర్గం రూపురేఖలు మారిపోయాయి. 8 సార్లు ఎమ్మెల్యేగా కుప్పానికి ప్రాతినిధ్యం వహించిన ఆయన మూడోసారి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఏపీకి నైరుతి మూలలో, తమిళ, కన్నడ సరిహద్దుల్లో విసిరేసినట్టుండే ఈ ప్రాంతం వైపు ప్రపంచం దృష్టి మరల్చేలా చేసిన ఘనత చంద్రబాబుదే. కాంగ్రెస్ పాలనాకాలంలో కుప్పం అభివృద్ధి మందగించేది. వైసీపీ పాలనలో మాత్రం కుప్పంపై కక్ష కట్టేశారు. ఎక్కడి పనులక్కడ స్తంభించిపోయాయి. కుప్పం అభివృద్ధి చతికిలపడింది. 2024లో చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులన్నీ మళ్లీ పట్టాలెక్కాయి. పరుగందుకున్నాయి. నారా చంద్రబాబు నాయుడు ఎనిమిదో సారి కుప్పం ఎమ్మెల్యేగా గెలిచిన తొలి ఏడాదిలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి ఏమిటి? విడుదలైన నిధులెంత? మంజూరైన పనులు ఏవి.. ఈ సంగతుల సమాహారమే ఈ కథనం...

ప్రోగ్రెస్ రిపోర్ట్



కడా కార్యాలయం

కుప్పం మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ భవిష్యత్తు రూపం

ఏడాదిలో ఏం జరిగింది?

ఏడాదిలో చేసినవి

పనులు	వ్యయం (రూ.కోట్లలో)
హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కాలువ లైనింగ్ పనులు	47.05
తారు రోడ్లు	22.00
సిమెంటు రోడ్లు	20.50
తాగునీటి సరఫరా	08.97
గోకులం షెడ్లు	07.63
వీధి దీపాలు	03.70
ఓహెచ్ఆర్ఎస్ మరమ్మతులు	02.43
పాఠశాలల ప్రహరీలు	01.64
బీటీ రోడ్ల మరమ్మతులు	01.53
ఆర్ అండ్ బీ నూతన భవనం	01.40
వ్యక్తిగత మరుగుదొడ్లు	01.08
అన్న క్యాంటీన్	00.66
గ్యాస్ కనెక్షన్లు	00.36
ఏరియా ఆస్పత్రి అభివృద్ధి	00.18
ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధి, శ్మశానం అభివృద్ధి	01.00
టాటా ఎండీ డిజిటల్ నెర్వ్ సెంటర్-	05.00
మొత్తం	120.42



నడిమూరులో ప్రతి ఇంటిమీదా కనిపిస్తున్న సోలార్ ప్యానెల్స్

సోలార్ కరెంటు

కుప్పం నియోజకవర్గం మొత్తం సోలార్ కరెంటు వినియోగించేలా పథక రూపకల్పన జరిగింది. నమూనాగా కుప్పం మండలం నడిమూరు గ్రామాన్ని ఎంచుకున్నారు.జనవరి 6న చంద్రబాబు ప్రయోగాత్మకంగా దీనిని ప్రారంభించారు. గ్రామంలోని వంద ఇళ్లకు సోలార్ ప్యానెల్స్ అమర్చారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాలతోపాటు వ్యవసాయ కనెక్షన్లను సోలార్ విద్యుత్తు మయం చేయడానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఎస్సీ, ఎస్టీలకు పూర్తి ఉచితంగా సోలార్ విద్యుత్తును అందించనున్నారు. ఈ పనులు వేగంగా జరుగుతున్నాయి.

పారిశ్రామిక కుప్పం చంద్రబాబు లక్ష్యం

● రూ.125 కోట్ల పనులు పూర్తి ● రూ.1167 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి

● మాస్టర్ ప్లాన్‌తో దూసుకుపోతున్న కడా

మంజూరైన పనులు

పనులు	వ్యయం (రూ.కోట్లలో)
వ్యవసాయ ఫీడర్లకు సోలరైజేషన్	564.00
మురుగునీటి కాలువల నిర్మాణం	110.21
చెరువులు, చెక్ డ్యామ్‌ల నిర్మాణం, మరమ్మతులు	87.08
ప్రధాన దేవాలయాల అభివృద్ధి	47.58
ఆర్ అండ్ బీ తారు రోడ్ల నిర్మాణం	38.45
హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కాలువ లైనింగ్ పనులు	37.95
టీటీడీ ద్వారా చిన్న దేవాలయాల అభివృద్ధి	33.67
సిమెంటు రోడ్లు	27.25
ఎస్సీ/ఎస్టీ గృహాలకు సోలరైజేషన్	21.80
గోకులం షెడ్లు	20.79
వ్యక్తిగత మరుగుదొడ్లు	19.77
33/11 కేవీ సబ్ స్టేషన్లు	18.01
ప్రాథమిక పాఠశాలల అభివృద్ధి	10.36
ఎన్టీఆర్ సుజల	08.22
వసతి గృహాల మరమ్మతులు	06.87
అన్న క్యాంటీన్లు	02.60
గ్రామ పంచాయతీ భవనాలు	02.60
కుప్పం ఏరియా ఆస్పత్రి అభివృద్ధి	01.57
ఓహెచ్ఆర్ఎస్ మరమ్మతులు	01.52
కుప్పం మున్సిపాలిటీ, స్పోర్ట్స్ కాంప్లెక్స్ సెంట్రల్ పార్క్ అభివృద్ధి	85.00
కేర్ ఎన్ గ్రో ప్రాథమిక బాల్య అభివృద్ధి కేంద్రాలు	02.90
మొత్తం	1167.61



లైనింగ్ పనులు పూర్తవడంతో వాన నీటితో నిండుగా కనిపిస్తున్న రామకుప్పం మండల పరిధిలోని హంద్రీ-నీవా కాలువ



శాంతిపురం మండలం కదిరివోబనపల్లె రోడ్డు



కుప్పం మండలం కంగుంది పంచాయతీ అంబాపురం ఎస్టీ కాలనీ మీదుగా అంబాపురం నుంచి కాళికాంబ ఆలయానికి వేసిన సిమెంటు రోడ్డు

కుప్పానికి కృష్ణ నీళ్లు: కృష్ణా జలాలను కుప్పానికి తీసుకు రావాలన్నది చంద్రబాబు కల. ఇందుకోసం 2014-2019లో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.575 కోట్ల అంచనా వ్యయంతో కుప్పం బ్రాంచి కాలువ పనులను ప్రారంభించారు. 80 శాతం పనులు పూర్తయ్యాయి. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఇవి ఆగిపోయాయి. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాలువ లైనింగ్ పనులకు 97.7 కోట్లు మంజూరయ్యాయి. 90 శాతం పనులు పూర్తయ్యాయి. హంద్రీ-నీవా కుప్పం బ్రాంచికి కృష్ణా జలాలను ఈనెల 29,30తేదీలలో ముఖ్యమంత్రి స్వయంగా వదులుతారని అంటున్నారు.అలాగే పాలారు మీద ఇప్పటికే ఉన్న చెక్ డ్యామ్‌ల పునరుద్ధరణకు కూడా నిధులు మంజూరయ్యాయి. ఆ పనులు సైతం త్వరలోనే ప్రారంభం కానున్నాయి.

పారిశ్రామిక కుప్పం: గతంలో కుప్పం వ్యవసాయికంగా అభివృద్ధి చెందేందుకు అనేక పథకాలు రూపకల్పన చేసిన చంద్రబాబు, ఈ సారి పారిశ్రామిక అభివృద్ధిపై దృష్టి పెట్టారు. దీనికోసం కడా ఇప్పటికే పునాది సిద్ధం చేసింది. అలీప్, మదర్ డెయిరీ, ఇ-రాయిస్, టెక్నాల్ ఎనర్జీ, కోవై క్లాసిక్ ఇండస్ట్రీస్, పౌ చెన్, అడిడాస్, యాసిక్స్, న్యూ బ్యాలెన్స్, సాలోమన్ అండ్ టిబర్ ల్యాండ్ తదితర కంపెనీలతో ఇప్పటికే ఎంఓయూలు కుదుర్చుకున్నారు. ఈ కంపెనీలకు నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో భూములను కేటాయించారు.ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించి వివిధ కంపెనీల ప్రతినిధులను రప్పించి, నియోజకవర్గంలోని 350 మందికి ఉద్యోగాలు కల్పించారు. ఇంకా 200 మంది యువత ఇంటర్వ్యూల స్థాయిలో ఉన్నారు. ఇవిగాక ఈజీ మార్ట్, 1ఎం1బీల ద్వారా వ్యాపార, కెరీర్ గైడెన్స్ ఇస్తున్నారు. ఈ కంపెనీల ద్వారా సమీప భవిష్యత్తులో సుమారు 30 వేల ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యం పెట్టుకున్నారు.

● కుప్పం మండలం బైరుగానిపల్లెలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు స్థలం కేటాయిస్తూ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే ద్రావిడ విశ్వవిద్యాలయానికి ఇటీవల ఇంజనీరింగు కోర్సులు మంజూరయ్యాయి.

● సింగపూర్ కన్సల్టెన్సీ ద్వారా సర్వే చేసి కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతానికి కడా ద్వారా రూ.56.50 కోట్లు కేటాయించారు. డ్రైనేజీ, కరెంటు, నీటి పైపులు భూగర్భంలోనే నిర్మించే పనులు రెండేళ్లలో పూర్తి చేయనున్నారు.

విమానాశ్రయం: శాంతిపురం, రామకుప్పం మండలాల మధ్య విమానాశ్రయంతోపాటు పారిశ్రామిక వాడ నిర్మాణానికి 1800 ఎకరాలను సేకరించారు. భూములు ఇచ్చిన రైతులకు ఎకరాకు రూ.16 లక్షలు పరిహారం చెల్లించే ప్రక్రియ కూడా ప్రారంభమైంది. ఏడాదిలో భూములను అభివృద్ధి చేసి, అవసరమైన అనుమతులు రాబట్టి, విమానాశ్రయం పనులు ప్రారంభించే అవకాశం ఉంది.

వికలాంగ ధృవీకరణ పత్రాలు: 3200 మందికి
ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు: 7,034 మందికి
పక్కా ఇళ్ల లబ్ధిదారులు: 14,469 మంది



శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బాడ్మింటన్ పోటీలకు ముస్తాబైన ఇండోర్ స్టేడియం

రేపటి నుంచే జోనల్ స్థాయి క్రీడా పోటీలు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు జోనల్‌స్థాయి క్రీడా పోటీలు కోలాహలంగా జరగనున్నాయి. ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవం, హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని శాప్ ఆధ్వర్యంలో క్రీడా సంబరాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. జోనల్ స్థాయిలో సత్తాచాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. తొలిరోజు ఉదయం 10 గంటలకు ఎస్వీ స్టేడియంలో ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాప్ చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరుకానున్నారు. డీఎస్‌డీవో శశిధర్ పర్యవేక్షణలో ఈ ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. వర్షం కారణంగా పోటీలు ఆగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. అలాగే 20న రిజర్వ్‌డేగా నిర్ణయించారు.

● **1,880మంది క్రీడాకారులు రాక :** రాయలసీమ జోన్ పరిధిలో వచ్చే తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, అనంతపురం, సత్యసాయి, నంద్యాల, కర్నూలు జిల్లాల నుంచి మొత్తం 1,880మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. తిరుపతి జిల్లా నుంచి 235మంది క్రీడాకారులు పోటీ చేయనున్నారు.

● **మైదానాలు ఇవే :** జోనల్ పోటీల కోసం ఎస్వీ స్టేడియం, శ్రీనివాస క్రీడాసముదాయం, ఎస్వీ ఆర్ట్స్ మైదానం, ఎస్వీయూ స్పోర్ట్స్ ఎరీనాలను ముస్తాబుచేశారు.

పది పాఠశాలల్లో బస : క్రీడాకారులకు నగర పరిధిలోని పది మున్సిపల్, ప్రభుత్వ పాఠశాలల్లో బస ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక రవాణా ఏర్పాట్లు, మూడు పూటలా భోజన సదుపాయం కల్పించారు. ఎంపికచేసిన 10పాఠశాలలకు డీఈవో ఆదేశాల మేరకు సోమ, మంగళవారాలలో సెలవు ప్రకటించారు.

తిరుమలలో గోకులాష్టమి

తిరుమల, ఆగస్టు16(ఆంధ్ర జ్యోతి): తిరుమలలో శనివారం గోకులాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. గోగర్భం డ్యాం వద్ద నున్న కాళీయమర్థనుడైన శ్రీకృష్ణస్వామికి పంచాభిషేకాలు చేశారు. స్థానిక యువతతో ఉట్లోత్సవం నిర్వహించారు. టీటీడీ గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. అలాగే రాత్రి శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి వద్ద ఉగ్రశ్రీనివాసమూర్తి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు, శ్రీకృష్ణస్వామికి ఏకాంతంగా తిరుమంజనం, ద్వాదశ ఆరాధన నిర్వహించారు. అనంతరం ప్రబంధ శాత్తుమొర, గోకులాష్టమి ఆస్థానం చేపట్టారు. కాగా ఆదివారం సాయంత్రం శ్రీవారి ఆలయం ముందు ఉట్లోత్సవం నిర్వహించనున్నారు. మలయప్పస్వామి, శ్రీకృష్ణస్వామి తిరుచ్చిలపై మాడవీధుల్లో ఊరేగనున్నారు.



కాళీయమర్థనుడైన శ్రీకృష్ణస్వామికి అభిషేకం చేస్తున్న టీటీడీ గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు

కొండనిండా భక్తులు





తిరుమల శ్రీవారి ఆలయం భక్తజన సంద్రంగా మారింది. వరుస సెలవుల నేపథ్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో కొండపై ఎటుచూసినా రద్దీ కనిపించింది. క్యూలన్నీ కిక్కిరిసిపోయాయి. పిల్లలు, వృద్ధులు ఇబ్బందులకు గురయ్యారు.



మిస్ తిరుపతిగా సాత్విక

వెంకటగిరి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఫరెవర్ స్టార్ మిస్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి అందాల పోటీల్లో వెంకటగిరికి చెందిన బీటెక్ విద్యార్థిని చెన్నమనేని గమన సాత్విక విజేతగా నిలిచారు. ఈ మేరకు ఆ సంస్థ శనివారం ఆ విద్యార్థి పేరును మిస్ తిరుపతిగా ప్రకటించింది. వెంకటగిరి వ్యవసాయ మార్కెటింగ్ మాజీ చైర్మన్ సీసీ నాయుడు కుమార్తె అయిన సాత్విక గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీలో బీటెక్ ఫైనలియర్ చదువుతోంది. మిస్ ఇండియా పోటీల్లో పాల్గొనడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆమె తెలిపారు.



ముక్కంటి సేవలో 30వేలమంది భక్తులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 16(ఆంధ్ర జ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వరుస సెలవులు రావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం ద్వారా 942 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 4,861, రూ.50 ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,919 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,798మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,488, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 479, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 373, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 109మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలను కలిపి 28,287 విక్రయించినట్టు ఆలయాధికారులు తెలిపారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం : ఒకరి అరెస్టు

మంగళం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా పెంచలకోన వద్ద శనివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి నాలుగు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్టు చేశారు. ఆర్ఐ సాయిగిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ వినోద్ కుమార్ బృందం నెల్లూరు జిల్లా రాపూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. పెంచలకోన వద్ద ఈదల చెరువు సమీపంలో కొందరు వ్యక్తులు వారి కంటబడ్డారు. పట్టుకునే ప్రయత్నం చేయగా ఒకరు మాత్రమే దొరికారు. సమీపంలో నాలుగు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వ్యక్తి నెల్లూరు జిల్లాకు చెందిన వాడిగా గుర్తించారు. స్మగ్లర్‌తో పాటు ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పెట్రోలు బంకుల్లో విజిలెన్స్ తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని పెట్రోలు బంకుల్లో శనివారం విజిలెన్సు అధికారులు తనిఖీలు చేపట్టారు. సీఎస్‌డీ గంగయ్య, లీగల్ మెట్రాలజీ విభాగం ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, విజిలెన్సు సీఐలు వెంకటరవి, చంద్రశేఖర్ తనిఖీలు నిర్వహించారు. అక్కారంపల్లి సర్కిల్ వద్దనున్న వెంకటసాయి ఫిల్లింగ్ స్టేషన్ పంపుల్లోని కొలతల్లో వ్యత్యాసాలున్నట్లు గుర్తించి, రెండు నాజిల్స్‌ను సీజ్ చేశారు.



గౌతు లచ్చన్న త్యాగం స్ఫూర్తిదాయకం

● కలెక్టర్ సుమిత్‌కుమార్



గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎంపీ ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్, బీసీ సంఘ నేతలు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గౌతు లచ్చన్న చూపిన మార్గం, చేసిన త్యాగం యువతకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్ హాలులో గౌతు లచ్చన్న జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యోద్యమం, జమీందారీ వ్యతిరేక పోరాటం, హరిజన సేవ, మద్యపాన నిషేధానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని చెప్పారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ.. బీసీ కులాల కోసం వచ్చే ఏడాదికల్లా ఇరువారం సమీపంలో గౌతు లచ్చన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని చేపడతామన్నారు. మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ సీఎంటీ త్యాగరాజన్, బీసీ సంఘ నేతలు ఆట్లూరి శ్రీనివాసులు, సంక్షేమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయన ప్రజల మనిషి: ఎస్పీ



గౌతు లచ్చన్న చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సర్దార్ గౌతు లచ్చన్న ఎప్పుడూ ప్రజల మనిషిగానే జీవించారని ఎస్పీ మణికంఠ అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో లచ్చన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్ బాషా, సీఐలు నిత్యబాబు, మనోహర్, సూర్యనారాయణ, డీటీసీ సీఐ అమర్నాథ్‌రెడ్డి, ఆర్ఐ సుధాకర్, ఎస్బీ ఎస్ఐ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాణిపాక క్షేత్రంలో కృష్ణాష్టమి వేడుకలు



గోపూజ చేస్తున్న ఈవో పెంచలకిషోర్ దంపతులు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో కృష్ణాష్టమి వేడుకలను వరసిద్ధుడి ఆలయ అధికారులు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కాణిపాకానికి చెందిన ఎ.ధనంజయ యాదవ్, ఎస్.రాజేంద్రయాదవ్ ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం ప్రధాన ఆలయంలో స్వామికి పూజలు చేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో పెంచలకిషోర్, సిబ్బంది పూజా సామగ్రిని గోశాలకు తీసుకొచ్చారు. అక్కడున్న గోవులకు పూజలు నిర్వహించారు. గోశాల ప్రాంగణంలో ఆలయ ఈవో దంపతులు ఉట్టి కొట్టారు. ఏఈవోలు ధనంజయ, ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, భక్తులు పాల్గొన్నారు.

జగన్ రాజకీయాలకు అనర్హుడు: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న సప్తగిరి ప్రసాద్

చిత్తూరు సిటీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ పతాకాన్ని గౌరవించని మాజీ సీఎం జగన్.. రాజకీయాలకు అనర్హుడని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ విమర్శించారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనకుండా తన అహంకారాన్ని, అహంభావాన్ని చాటుకున్నారని మండిపడ్డారు. జగన్ కార్యాలయంలో తన మాజీ సలహాదారుడైన సజ్జల రామకృష్ణారెడ్డితో జాతీయ పతాకాన్ని ఎగురవేయించారని చెప్పారు. జెండా ఎగురవేయక పోవడం అంటే మువ్వన్నెల జెండాను, స్వాతంత్ర్య సమర యోధులను అవమానించడమేనని తెలిపారు. ఇటీవల జరిగిన పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీని ప్రజలు చిత్తుగా ఓడించడంతో ఆ కోపాన్ని ఈవిధంగా చూపించారని అభిప్రాయపడ్డారు. నేతలు మోహన్‌రాజ్, మేషాక్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పట్ల వివక్ష వద్దు



ధర్నా చేస్తున్న దివ్యాంగులు

బంగారుపాళ్యం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పట్ల వివక్ష మానాలని వికలాంగుల సంఘ రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ కోరారు. శనివారం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట జాతీయ రహదారిపై దివ్యాంగులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో ఏడువేల మంది దివ్యాంగులు ఉన్నారన్నారు. సర్వేల పేరుతో కొందరికి పర్సంటేజీలు తక్కువ చేసి, పింఛన్లు తొలగించే కార్యక్రమాన్ని చేపట్టడం తగదన్నారు. జేఏసీ ఉపాధ్యక్షుడు మురళి, మహిళా అధ్యక్షురాలు సుమతి, కార్యదర్శి లీలాపతి నాయుడు, పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.

పార్థసారథికి గవర్నర్ అభినందనలు



చిత్తూరు రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరానికి చెందిన పార్థసారథినాయుడు చేసిన సేవా కార్యక్రమాలకుగాను స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ నిర్వహించే ఎట్ హోమ్ కార్యక్రమానికి ఆహ్వానం వచ్చిన విషయం తెలిసిందే. శుక్రవారం రాత్రి ఈ కార్యక్రమానికి హాజరైన పార్థసారథినాయుడిని గవర్నర్ అభినందించారు.

22 మండలాల్లో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 22 మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. గుడిపాలలో అత్యధికంగా 18.4, బైరెడ్డిపల్లెలో అత్యల్పంగా 0.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా.. పెద్దపంజాణిలో 12, పూతలపట్టు, కార్వేటినగరంలో 11.2, గంగవరంలో 10.2, చిత్తూరు రూరల్‌లో 9.4, పాలసముద్రంలో 8.2, తవణంపల్లెలో 7.2, చిత్తూరు అర్బన్‌లో 7, బంగారుపాళ్యం, యాదమరిలో 6.6, విజయపురంలో 6.4, పెనుమూరులో 5.6, నగరిలో 5.4, గంగాధరనెల్లూరులో 5, నింద్రలో 4.2, వెదురుకుప్పం, పలమనేరులో 4, సోమలలో 2.6, శ్రీరంగరాజపురంలో 2.2, పుంగనూరులో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

కిటకిటలాడిన ఆనందగిరి

● వైభవంగా ఆడికృత్తిక వేడుకలు ● పుష్ప పల్లకిలో ఊరేగిన సుబ్రమణ్యస్వామి





భక్తులతో కిటకిటలాడుతున్న ఆనందగిరి ఆలయం, పుష్పకావిళ్లతో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



పుష్పపల్లకి సేవలో సుబ్రమణ్యస్వామి

పాకాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆడికృత్తికను పురస్కరించుకుని జిల్లాలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు శనివారం హరోంహర నామస్మరణతో మార్మోగాయి. పాకాల మండలం ఉట్లవారిపల్లె ఆనందగిరి (పాళ్యంకొండ)పై వెలసిన వల్లీదేవసేన సమేత కల్యాణ సుబ్రమణ్యస్వామి ఆలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఉభయదారులు కోరా రామాంజులు నాయుడు, కోరా సుబ్రమణ్యం నాయుడు కుటుంబ సభ్యులు పాలకావిడి సమర్పించి, పాలాభిషేకం నిర్వహించారు. ఉభయదారుడు సుబ్రమణ్యంరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో చలపతిరాజు, గౌరీశంకరరాజు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. ఉభయదారులు ఆముదపాకల ఆదికేశవులు నాయుడు, ఆముదపాకల శ్రీహరినాయుడు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో రాత్రి ఊంజల్‌సేవ నిర్వహించారు. ఉభయదారులు లావణ్యాస్ పిక్చర్స్ ప్రేమ్స్ వారి ఆధ్వర్యంలో పుష్పపల్లకి సేవ నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన పల్లకిపై స్వామివారు రాత్రి పురవీధులలో ఊరేగారు. ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారి దర్శనానికి విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పుష్పకావిళ్లు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. పలువురు ప్రముఖులు స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఇందులో తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు, చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఎమ్మెల్యే పులివర్తి నాని ఆలయం వద్ద సౌకర్యాలను పర్యవేక్షించారు. టీడీపీ మండల నేతలు అన్నదానం చేశారు. భక్తబృందాలు ఉచిత ప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ, పాలు పంపిణీ చేశారు. గల్లా రాజశేఖర్ నాయుడు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో 52 వేల ఉచిత లడ్డూ ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఛైర్మన్ సోంపల్లి చంద్రశేఖర్ నాయుడు, ఈవో యువరాణి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆధునిక హంగులతో 'వెదురారణ్యం'

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు కలెక్టరేట్ ఆవరణలో అటవీ శాఖ ద్వారా ఆధునిక హంగులతో వెదురారణ్యం ఏర్పాటు చేసినట్లు చిత్తూరు ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యే జగన్మోహన్ తెలిపారు. అటవీ శాఖ తూర్పు రేంజ్‌లోని 125 ఎకరాల విస్తీర్ణంలో రూ.1.40 కోట్లతో ఏర్పాటు చేసిన వెదురారణ్యంను కలెక్టర్ సుమిత్ కుమార్, డీఎఫ్‌వో భరణితో కలిసి ప్రారంభించారు. ప్రాంగణంలో మొక్కలు నాటారు. వెదురు కర్రలతో ఏర్పాటు చేసిన గ్యాలరీలో ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానిక ప్రజానీకానికి ఆహ్లాదం, ఆరోగ్యం, వినోదం అందించడానికి మరో వేదిక తయారైందని చెప్పారు. డీఎఫ్‌వో మాట్లాడుతూ ఇక్కడకు కుటుంబ సమేతంగా రావచ్చన్నారు. కొలను ప్రాంతాలు, నడక, వ్యాయామం చేసుకునే వీలుందన్నారు. చిన్నపిల్లల కోసం అడ్వెంచర్స్, సాంస్కృతిక కార్యక్రమాల కోసం వెదురుతో నిర్మించిన ఆడిటోరియం ఉన్నాయని వివరించారు. భవిష్యత్తులో నక్షత్రవనం, రాశివనాన్ని సైతం ఇక్కడ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, ఎఫ్ఆర్వో థామస్ సుకుమార్, డీఆర్వో కరమ్‌సింగ్, బీట్ అధికారులు మణికుమారి, హరిప్రియ, ప్రభాకర్‌రెడ్డి, గౌస్‌బాష, కాంట్రాక్టర్ చందుచౌదరి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వెదురారణ్యంలో మొక్క నాటి నీరు పోస్తున్న ఎంపీ ప్రసాదరావు, పక్కన ఎమ్మెల్యే జగన్మోహన్, కలెక్టర్ సుమిత్‌కుమార్, డీఎఫ్‌వో భరణి తదితరులు

ప్రారంభం రోజే పాము కలకలం



పొదల్లోకి వెళుతున్న నాగుపాము

'వెదురారణ్యం' అరగంటలో ప్రారంభం కానుండగా, నాగుపాము సంచారం కొంత కలకలం సృష్టించింది. ప్రారంభోత్సవానికి వచ్చిన వారంతా చూస్తుండగానే రోడ్డుపై అటు నుంచి ఇటుగా నెమ్మదిగా పొదల్లోకి వెళ్లిపోయింది. మరోవైపు పాముకు ఆహూతుల నుంచి ఎలాంటి ప్రమాదం కలగకుండా ఫారెస్టు సిబ్బంది అడ్డుకున్నారు.

అడవిలో తిష్ఠ వేసిన ఏనుగుల గుంపు



అడవిలో సంచరిస్తున్న ఏనుగుల గుంపులోని ఓ ఏనుగు

కల్లూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో రోజూ పంటలను ధ్వంసం చేస్తున్న 16 ఏనుగుల గుంపు రెండు రోజులుగా అటవీ ప్రాంతంలోనే తిష్ఠ వేశాయి. తూర్పు విభాగం అటవీ ప్రాంతం సైదుల్లా గుట్టకు సమీపంలోని బోదబండ వద్ద ఏనుగులు సంచరిస్తున్నాయి. మామిడికాయలు, వరి కోతలు పూర్తవడంతో పంటల్లోకి వస్తున్న ఏనుగులకు మేత సమృద్ధిగా దొరకడంలేదు. దీనికి తోడు ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో చెట్లలోని ఆకులు, గడ్డి విరివిగా ఉండటంతో ఏనుగులు అడవికే పరిమితమవుతూ అక్కడే ఉంటున్నాయి. పగలంతా బోదబండ, మేఘాలకోన, దేవరకోన ప్రాంతాల్లో సంచరిస్తూ ఏనుగులు పొట్టనింపుకుంటున్నాయి. ఓ ఏనుగు నిండు గర్భంతో ఉందని, దీంతో ఈతకు రావడంతోనే ఏనుగుల గుంపు అడవిలోనే ఉన్నాయనే పుకార్లు షికార్లు కావడంతో అటవీశాఖ సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేశారు. అడవి వైపు పశుకాపరులు ఎవరూ వెళ్లొద్దని హెచ్చరించారు. అయితే ఏనుగు గర్భంగా ఉన్నట్లు.. ఈతకు వచ్చినట్లు ఎలాంటి ఆధారాలు లేవని అటవీశాఖ సిబ్బంది స్పష్టం చేశారు. అడవిలో ఉన్న ఏనుగుల గుంపు ఎప్పుడు పొలాల్లోకి చేరుకొని పంటలు ధ్వంసం చేస్తాయో తెలియక రైతులు నిత్యం భయాందోళన చెందుతున్నారు.

బియ్యం పంపిణీలో 13వ స్థానం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కార్డుదారులకు ఈనెల ఒకటో తేదీనుంచి ప్రారంభమైన ఉచిత బియ్యం పంపిణీ గడువు ఈనెల 15వ తేదీ శుక్రవారం అర్ధరాత్రితో ముగిసింది. 5,34,721 రేషన్‌కార్డులకు 90.10 శాతం (4,81,791 కార్డుదారులకు) ఉచిత బియ్యం, నగదుపై అరకిలో పంచదార పంపిణీ చేశారు. పోర్టబిలిటీ ద్వారా 94,703 కార్డుదారులకు సరుకులను అందజేశారు. మొత్తానికి రాష్ట్రస్థాయిలో జిల్లా 13వ స్థానంలో నిలిచింది.

గ్యాస్ లీకై కూలిన ఇల్లు



వి.కోట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం బోయచిన్నాగపల్లె గ్రామంలో గ్యాస్ లీకై శనివారం రాత్రి దామోదర్‌రెడ్డికి చెందిన ఇంటి పైకప్పు పూర్తిగా కూలిపోయింది. ఆ ఇంట్లో గోవిందప్ప అనే మడవలి కుటుంబం కొంత కాలంగా ఉంటున్నారు. కావడి తీసుకొని మొక్కులు చెల్లించేందుకు గుడికి వెళ్లడంతో అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. గ్రామస్థుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సిలిండర్ అలాగే ఉందని.. గ్యాస్ బాగా లీకవ్వడంతో మంటలకు పైకప్పు కుప్పకూలినట్లు ఎస్సై జావేద్ బాషా ధ్రువీకరించారు. రాత్రి సమయం కావడంతో శిథిలాలను తొలగించేందుకు వీలుకాదని.. రాత్రికి ఇంటి పరిసరాలకు ఎవరూ వెళ్లరాదని సూచించారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిత్తూరు రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని 400 కేవీ, చిత్తూరు సబ్‌స్టేషన్‌లోని 220 కేవీ మహదేవ మంగళం ఫీడరు మరమ్మతుల కారణంగా ఆది, సోమవారాల్లో ఉదయం 6.30 సాయంత్రం 6.30 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. ఈ మేరకు చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ప్రత్యామ్నాయంగా ఇతర లైన్ల నుంచి విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

వేడుకగా శ్రీకృష్ణ జన్మాష్టమి



ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ

వెదురుకుప్పం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఉదయం 10నుంచి 11 గంటల వరకు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఆస్థానం, పురాణపఠనం నిర్వహించాక రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి తిరుచ్చిపై ఆలయ మాడ వీధుల్లో విహరించారు.

అలరించిన నృత్య నివేదన



బొబ్బిలి ప్రసాద్ నాట్యం

వేణుగోపాలస్వామి ఆలయంలో ఏటా శ్రీకృష్ణ జన్మాష్టమి నాడు బొబ్బిలి రాజాల వంశీకుడైన వీఏకే రంగారావు నృత్య నివేదనతో స్వామివారిని ఆరాధిస్తున్న సంగతి తెలిసిందే.ఈసారి రంగారావు స్థానంలో ఆయన దత్తపుత్రుడు బొబ్బిలి ప్రసాద్ వేణుగోపాలస్వామి సమక్షంలో చేసిన నాట్యం భక్తులను ఆకట్టుకుంది.

గొర్రెల మందపై చిరుత దాడి



చిరుత దాడిలో గాయపడ్డ గొర్రె

చౌడేపల్లె, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గొర్రెల మందపై చిరుత దాడి చేయడంతో ఓ గొర్రె మృతి చెందిన సంఘటన చౌడేపల్లె మండలంలో జరిగింది. ఆమినిగుంటకు చెందిన ప్రభాకర్ శనివారం కడియాల కుంట సమీపంలోని అంకాలమ్మ కొండ అటవీ పరిసర ప్రాంతంలో గొర్రెలు మేపుతుండగా పొదలచాటు నుంచి ఓ చిరుత దాడి చేసింది. మూడు గొర్రెలు గాయపడగా.. ఒక గొర్రెను చంపి అడవిలోకి తీసుకెళ్లింది. ప్రభాకర్ కేకలు పెడుతూ అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఎఫ్ఎస్‌వో ఇంద్రాణి, ఎఫ్‌బీవోలు ప్రభాకర్, రామచంద్ర సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చిరుత కాలి ముద్రలను గుర్తించారు.గ్రామస్తులతో పాటు పశువుల కాపరులకు చిరుత పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.



చిరుత కాలి గుర్తును పరిశీలిస్తున్న ఎఫ్‌బీవో ప్రభాకర్

పలమనేరు
కుప్పం/పుంగనూరు

శాస్త్రీయ సమాజ నిర్మాణమే జనవిజ్ఞాన వేదిక లక్ష్యం



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు తదితరులు

పలమనేరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : శాస్త్రీయ సమాజ నిర్మాణమే జనవిజ్ఞాన వేదిక లక్ష్యమని జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. శనివారం పలమనేరులోని ఓ ప్రైవేటు పాఠశాల ఆవరణలో జిల్లా జనవిజ్ఞానవేదిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా ప్రభావంతో ప్రజల్లో మూఢనమ్మకాలు, సూడో సైన్స్, అశాస్త్రీయ భావజాలం విపరీతంగా ప్రచారం అవుతోందని.. వీటిని అరికట్టే శాస్త్రీయ సమాజం నిర్మించాలంటే యువత జనవిజ్ఞాన వేదిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా జనవిజ్ఞానవేదిక నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా అరుణ శివప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా యుగంధర్ బాబు, కోశాధికారిగా కరమల గిరిధరమూర్తి, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పలమనేరు బాలాజీ, నాయకులు మునిరత్నం, సుదాకర్, విజయకుమార్, ఆనంద్‌బెన్, సెల్వం, శ్యామల, రామలింగం పాల్గొన్నారు.

వైభవంగా రాజనాలబండ తిరునాళ్ల





కొండపైన ఆలయం వద్ద ఉన్న భక్తులు, ప్రత్యేకాలంకరణలో ఆంజనేయస్వామి

చౌడేపల్లె, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో శనివారం వైభవంగా తిరునాల ప్రారంభమైంది. చౌడేపల్లె మండలం రాజనాలబండ సమీపంలోని నరసింహస్వామి కొండపై స్వయంభువుగా వెలసిన లక్ష్మీనరసింహస్వామికి, రాజనాలబండపై క్షేత్రపాలకుడిగా వెలసిన ఆంజనేయస్వామికి ఆలయ నిర్వాహకులు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో రాజనాలబండ, నరసింహస్వామి కొండ భక్తులతో కిక్కిరిశాయి. స్వామి వార్లకు మొక్కులు చేసుకున్న భక్తులు కొండపై తలనీలాలు సమర్పించారు. రాజనాలబండ, ఎస్ఎల్ఎన్ యువత, బోయకొండకు చెందిన రేణుకమ్మ, శ్రీనివాసులు జ్ఞాపకార్థం వారి కుమారులు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు సాయంత్రం కొండపై రాతి ధ్వజస్తంభంపై నేతితో అఖండ దీపాన్ని భక్తిశ్రద్ధలతో వెలిగించారు. రాత్రి ఆంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామిలను పెద్దూరు, దాసరయ్యగారిపల్లె, ఊటూరు దేవరెద్దులతో కలిసి పెద్దూరు, గాజులవారిపల్లె, మల్లెలవారిపల్లె, వెంగళపల్లె, ఊటూరు, కొండామర్రి, కొత్త గూబలవారిపల్లె, పాతగూబలవారిపల్లె గ్రామాల్లో మంగళవాయిద్యాలు, చెక్కభజనలు, కోలాటాల మధ్య ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో ఏబీఎన్ చౌదరి, సూపరింటెండెంట్ నాగేంద్రప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు బానుప్రకాశ్, ధనంజయరావు, టీడీడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులకు మహిళల పూజలు



నంజంపేటలో బస్సుకు పూజలు చేస్తున్న మహిళలు

సోమల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సూపర్‌సిక్స్ అమల్లో భాగంగా స్త్రీ శక్తి పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం ప్రారంభించడతో గ్రామీణ మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్సు సర్వీసులు గ్రామాలకు రావడంతో పల్లెల్లో సందడి నెలకొంది. శనివారం పెద్దఉప్పరపల్లె, నంజంపేటల్లో ఆర్టీసీ బస్సులకు మహిళలు పూజలు నిర్వహించారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, మాజీ సర్పంచ్ బాలాజీ నాయుడు, రమేశ్‌నాయుడు, తిలక్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

ఉత్తమ సేవలకు పురస్కారాలు

వి.కోట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం తోటకనుమలో డ్రాగెన్ ఫ్రూట్ సాగు చేస్తున్న ఉద్యాన రైతు సీహెచ్ మోహన్‌రావుకు జిల్లా ఉత్తమ ఉద్యాన రైతు అవార్డు అందుకున్నారు. వి.కోట పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సై రమేష్, కానిస్టేబుల్ మురళీలకు పంద్రాగస్టున అవార్డులు లభించాయి.



అవార్డు అందుకుంటున్న మోహన్‌రావు

రైతులకు మెరుగైన సేవలే లక్ష్యం



ఆనందరెడ్డి, రవిరెడ్డిలను సన్మానిస్తున్న రెస్కో, వైస్‌చైర్మన్ విశ్వనాథ్

రామకుప్పం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రెస్కో, ఏఎంసీ పాలక వర్గాల్లో చోటు పొందిన వారు రైతులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా కృషి చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు ఆనంద రెడ్డి, రామకుప్పం-1 క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి కోరారు. రెస్కో వైస్‌చైర్మన్‌గా నియమితులైన తెలుగు యువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్, రెస్కో, ఏఎంసీ డైరెక్టర్లుగా నియమితులైన సతీష్, మునీంద్రనాయక్, విజయ్‌కుమార్ శనివారం ఆనందరెడ్డి, రవిరెడ్డిలను కలిసి శాలువతో సన్మానించారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆనందరెడ్డి కోరారు.

సుబ్రహ్మణ్యస్వామి సేవలో అమర్



ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి సుబ్రహ్మణ్యస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పలమనేరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలోని టి.ఎస్. అగ్రహారం కొండపై వెలసిన శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని శనివారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి దర్శించుకున్నారు. ఆడికృత్తిక సందర్భంగా అమరనాథరెడ్డి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను ఎమ్మెల్యేకు అందజేశారు. అనంతరం టీడీపీ నాయకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్.బి.సి.కుట్టి, గిరిబాబు, సుబ్రహ్మణ్యగౌడు, ఖాజా, మదన్‌మోహన్, రూపేష్, జగదీష్, హరీష్, సుధాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

శశికుమార్‌కు ఘన సన్మానం

పలమనేరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియాలో ర్యాంకులు సాధించిన పలమనేరులోని లక్ష్మీపతి కుమారుడు శశికుమార్‌ను స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో శనిఆవరం సామాజిక కార్యకర్త మధుమోహన్‌రావు సన్మానించారు. శశికుమార్ ఈఎంఎ, సీఏలో ఆల్ ఇండియా ర్యాంకులు సాధించాడు. చిన్నప్పటినుంచి చదువులో చురుగ్గా ఉంటూ పదో తరగతి నుంచి ఇప్పటి వరకు ఏడు సార్లు జాతీయ ర్యాంకులు సాధించాడు.



శశికుమార్‌ను సన్మానించిన మధుమోహన్‌రావు

విద్యార్థులకు నగదు బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దాతలు

సదుం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు శనివారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన సంతోష్, రామ్‌చరణ్, హర్షద్‌లకు డీలర్ మాధవరెడ్డి, రవికుమార్ రెడ్డి, జయకుమార్ రెడ్డి విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. హెచ్‌ఎం నిరంజన్‌కుమార్ రెడ్డి , విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్లూరులో బస్టాండు నిర్మించరూ..!

- నిలువ నీడలేక రోడ్లపైనే ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



కల్లూరులో రోడ్లపై నిలబడి ఉన్న ప్రయాణికులు

కల్లూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు పట్టణంలో ఆర్టీసీ బస్టాండు లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. దీనికితోడు ఎలాంటి బస్ షెల్టర్లు నిర్మించకపోవడంతో ఆర్టీసీ బస్సుల కోసం జనం రోడ్లపైనా, దుకాణాల వద్ద నిలబడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. నిలుచుకునేందుకు ఏమాత్రం నీడలేకపోవడంతో రహదారి పక్కన ఉండే దుకాణాల ముందు నిలబడి ఆ దుకాణ యజమానుల నుంచి చీవాట్లు పడుతున్నారు. కల్లూరులో నిత్యావసర సరుకులు, బియ్యం వ్యాపారాలు జిల్లా స్థాయిలో పేరు గడించడంతో జిల్లా నుంచి ప్రజలు నిత్యం కల్లూరుకి రాకపోకలు కొనసాగిస్తుంటారు. పీలేరు, పుంగనూరు, రొంపిచెర్ల, చిత్తూరు, తిరుపతి వైపు వెళ్లే ప్రయాణికులకు కల్లూరు కూడలి ప్రాంతం కావడంతో వేలసంఖ్యలో ప్రయాణికులు తరలి వెళుతుంటారు. కల్లూరు పట్టణానికి బస్టాండు సౌకర్యం కల్పించాలని కొన్నేళ్లుగా ప్రభుత్వాలను, ప్రజాప్రతినిధులను కోరుతున్నా ఫలితం మాత్రం కనిపించడంలేదు. కనీసం ప్రయాణికులు నిలుచుకునేందుకు బస్ షెల్టర్లు నిర్మించిన దాఖలాలు లేవు. ఇటీవల కాలంలో రంగంపేట నుంచి పీలేరు వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు జరగడంతో రహదారిపై ఉండే అన్ని గ్రామాల వద్ద కాంట్రాక్టర్లు బస్ షెల్టర్లు నిర్మించారు. కల్లూరుకి సమీపంలోని కొమ్మిరెడ్డిగారిపల్లి క్రాస్ వద్ద ఎలాంటి గ్రామాలు లేకపోయినా రెండు బస్ షెల్టర్లను నిర్మించి చేతులు దులుపుకున్న కాంట్రాక్టర్లు కల్లూరులో బస్ షెల్టర్లు నిర్మించడం మరిచిపోయారు. ఆర్టీసీకి ప్రయాణికులతో కోట్ల రూపాయలు ఆదాయం వస్తున్నా సౌకర్యాలు కల్పించడంలో ఆర్టీసీ అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాలుగురోడ్లలో కనీసం నాలుగు బస్ షెల్టర్లు నిర్మించాల్సిన సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్లూరులో బస్టాండు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

రామకుప్పం బస్టాండుకు దారివ్వండి

- రోడ్డుపైనే నిలుస్తున్న బస్సులు
- పట్టించుకోని పాలకులు





రామకుప్పంలో నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్‌స్టేషన్, అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

రామకుప్పం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉంది. కొందరు పెద్దల స్వార్థ ప్రయోజనాలు, వారిచ్చిన సలహాలతో రెండు దశాబ్దాల క్రితం ఏమాత్రం అనువుగా లేని సంత జరిగే స్థలంలో బస్‌స్టేషను నిర్మించారు. దీంతో అది ప్రారంభం నుంచే నిరుపయోగంగా మారింది. బస్‌స్టేషన్‌కు వెళ్లే దారి ఇరుకుగా ఉండటంతో ఈ పరిస్థితి నెలకొంది. బస్‌స్టేషన్ దారి పక్కన ఇరువైపులా ఉన్న ప్రైవేటు భవనాలను తొలగిస్తే తప్ప బస్‌స్టేషన్‌లోకి బస్సుల రాకపోకలు సాధ్యం కాదు. ఈ విషయమై ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు హామీలిస్తున్నారే తప్ప కార్యరూపం దాల్చలేదు. బస్‌స్టేషను నిరుపయోగంగా మారడంతో బస్సులు పట్టణ బజారువీధిలో రోడ్డుపైనే నిలుస్తున్నాయి. దీంతో ప్రయాణికులు, పాదచారులు అసౌకర్యానికి గురవుతున్నారు. నిర్వహణ కరవై అక్కడి మరుగుదొడ్లు దుర్వాసన వెదజల్లుతున్నాయి. మరోవైపు బస్‌స్టేషను స్థలంలోనే ప్రతి సోమవారం వారపు సంత జరుగుతోంది. ఒక వేళ బస్‌స్టేషన్ దారిని విస్తరిస్తే ప్రతి సోమవారం బస్సుల రాకపోకలు ఇబ్బందికరంగా ఉంటుంది. వారపు సంత స్థలం నలువైపులా ఆక్రమణలకు గురై కుచించుకుపోయింది. వారపు సంత స్థలంలో ఆక్రమణలు తొలగిస్తే ఆ స్థలంలో బస్సుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా వారపు సంత నిర్వహించుకోవచ్చు. ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



రామిరెడ్డిగారిపల్లిలో కావళ్లతో ఆలయాలకు వెళుతున్న భక్తులు



సోమల పట్టణంలో ఊరేగుతున్న పుష్పకావళ్లతో భక్తులు



పాలరేవుగడ్డలో భక్తజన సందోహం, (ఇన్‌సెట్లో) సుబ్రహ్మణ్యస్వామి

భక్తిశ్రద్ధలతో ఆడికృత్తిక వేడుకలు

- ఊరూరా కావళ్ల సందడి
- సుబ్రహ్మణ్యస్వామి ఊరేగింపు

కల్లూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆడికృత్తిక పండుగను పురస్కరించుకొని పులిచెర్ల మండలంలోని పల్లెలు శనివారం హరోంహర నామస్మరణలతో మార్మోగాయి. మండలంలోని ఎల్లంకివారిపల్లి, రామిరెడ్డిగారిపల్లి ఎలకబైలులో వెలసిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాల్లో ఉదయం పూజలు ప్రారంభమయ్యాయి. గ్రామాల నుంచి భక్తులు కావళ్లతో తిరుత్తణి, పాకాల, సదుం ఆలయాలకే కాకుండా మండలంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలకు తరలివెళ్లారు.

కిటకిటలాడిన బంగారు తిరుత్తణి కొండ

సోమల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణ సమీప బంగారు తిరుత్తణి కొండపై ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా శనివారం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయం, సాయిబాబా ఆలయం, వినాయకస్వామి ఆలయాల్లో భక్తులు సామూహిక పుష్పకావళ్లకు పూజలు నిర్వహించారు. అనంతరం సోమల పురవీధుల్లో భక్తులు హరోం హర నామస్మరణలతో ఊరేగారు. బంగారు తిరుత్తణి కొండకు వెళ్లి స్వామివారికి ముడుపులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్త మేల్నాటి రఘుపతి పద్మావతమ్మ, రెడ్డి జనార్దన్, పూల మురళీకృష్ణ, శ్రీదేవి, సుబ్రహ్మణ్యం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

● **రామకుప్పం:** ఆడికృత్తిక, శ్రావణ శనివారాన్ని పురస్కరించుకుని రామకుప్పంలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, పద్మావతి, వేంకటేశ్వరస్వామి, పాలరేవుగడ్డలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో శనివారం విశేష పూజలు జరిగాయి. భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

● **కుప్పం:** కుప్పం పట్టణ శివార్లలోని కమతమూరు బాలసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శనివారం ఆడికృత్తిక వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌తో కలిసి ఆలయాన్ని సందర్శించి స్వామి వారి సేవలో పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ నిర్వాహకులు స్వామి వారి ఉత్సవమూర్తిని గ్రామ వీధుల్లో ఊరేగించారు.

● **చౌడేపల్లె:** స్థానిక బజారు వీధిలో వెలిసిన అభీష్టదమృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో వెలసిన షణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామికి ఆలయ అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం నెమలి వాహనంపై వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవ మూర్తులను అధిష్ఠింపజేసి పురవీధుల్లో ఊరేగించారు.

● **పెద్దపంజాణి :** మండలంలోని బసవరాజుకండ్రిగలో ఆడికృత్తిక ఘనంగా నిర్వహించారు. శనివారం సుమారు 50 కుటుంబాలకు పైగా కావళ్లతో తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి బయలుదేరారు.

కనులపండువగా కల్యాణోత్సవం

సదుం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆడికృత్తిక మహోత్సవంలో భాగంగా శనివారం సదుంలోని సుబ్రహ్మణ్యస్వామి వారికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణతోపాటు కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం కల్యాణోత్సవ భక్తులకు అన్నదానం చేశారు.



చౌడేపల్లె : కావళ్లతో ఆలయాలకు వెళుతున్న భక్తులు



సదుంలో సుబ్రహ్మణ్యస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



కమతమూరుక్రాస్ బాలసుబ్రహ్మణ్య స్వామి సేవలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి



శ్రీకృష్ణుడిని పురవీధుల్లో ఊరేగిస్తున్న ఇందూ జ్ఞానసమితి సభ్యులు



రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడి ఊరేగింపు



పలమనేరు : ప్రత్యేకాలంకరణలో సంతాన వేణుగోపాలస్వామి

పలమనేరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక సభ్యులు శనివారం పలమనేరులో రఘువీరారెడ్డి కాలనీ సమీపంలో శ్రీకృష్ణుడిని ప్రత్యేకంగా అలంకరించి ఘనంగా ఊరేగించారు. జవులివీధి, బజారువీధి, ఎద్దులసంత వీధి, రంగబాబు సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ జాతీయ రహదారి మీదుగా స్వామి వారి ప్రతిమను ఊరేగించారు. కార్యక్రమంలో ఇందూ జ్ఞానవేదిక పలమనేరు కమిటీ అధ్యక్షులు రెడ్డిభాస్కర్, జ్యోతి, సరళ, రోజా, వింధ్య, హేమంత్, రెడ్డెమ్మ, రేఖ, కళ్యాణి, గౌతమ్, హరిబాబు, రాజేంద్రలతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సంతాన వేణుగోపాలస్వామికి పూజలు

పలమనేరులో శనివారం గోకులాష్టమి సందర్భంగా పాతపేటలో వెలసిన సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

● **చౌడే పల్లె:** కృష్ణాష్టమి పర్వదినాన్ని స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. శనివారం ఆలయ అర్చకులు రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వాములకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శేషవాహనంపై మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరిగించారు.



● **పుంగనూరు:** పుంగనూరులో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. స్థానిక కృష్ణమరెడ్డిపల్లె రోడ్డులో వెలసిన శ్రీకృష్ణుడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్ర యాదవ్, ఆలయ కమిటీ ప్రతినిధులు ఎర్రప్పయాదవ్, ఎల్వీ రమణయాదవ్, మోహన్, లింగమూర్తి, వెంకటేశ్వర రెడ్డి, నారాయణస్వామి, యాదవ ఉద్యోగ, ఉపాధ్యాయసంఘ నాయకులు పాల్గొన్నారు.

● **వి.కోట:** వి.కోట మండలం పాముగానిపల్లె పంచాయతీ పరిధి కృష్ణమ్మ కొండపై కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. కొండపై వెలసిన వేణుగోపాలస్వామి వారికి విశేష పూజలు చేపట్టారు.



● **సోమల:** సోమల మండలం పెద్దఉప్పరపల్లె గోకులవీధిలోని శ్రీకృష్ణ ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా మూలవిగ్రహాలకు ప్రత్యేక అలంకరణలు చేసి అభిషేక పూజలు చేశారు. రాత్రి శ్రీకృష్ణ కల్యాణం నిర్వహించారు.

● **బైరెడ్డిపల్లె :** బైరెడ్డిపల్లెలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

● **రామకుప్పం :** మండలంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. విజలాపురం, కొంగనపల్లె గ్రామాల్లోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయాల్లో దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు.

● **వి.కోట:** వి.కోటలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. యాదవ సంఘం వారిచే పట్టణంలో వెలసిన రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారికి ఉదయాన్నే ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అశ్వ వాహనంపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చి పట్టణంలో ఊరేగించారు.



వి.కోటలో వేణుగోపాలస్వామి



ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి

● **పెద్దపంజాణి:** మండలంలోని ముద్దేపల్లె వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. నేలపల్లె శ్రీకృష్ణస్వామి ఆలయంలో కృష్ణకోటి నిర్వహించారు. మండలకేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పుంగనూరులో చెక్కభజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న కళాకారులు

కృష్ణాష్టమి వేడుకలు




హైరోడ్డులోని శ్రీకృష్ణ మందిరంలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): హైరోడ్డులోని శ్రీకృష్ణమందిరంలో శనివారం స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చుడా చైర్‌పర్సన్ హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మేయర్ అముదతోపాటు ఆలయ నిర్వాహకులు, యాదవ సంఘ నాయకులు పాల్గొన్నారు. గిరింపేట గాయత్రి నగర్ గోకుల కృష్ణాలయంలో జరిగిన పూజల్లో ఎమ్మెల్యే జగన్మోహన్ తన అనుచరులతో పాల్గొన్నారు. చర్చివీధిలోని శ్రీకృష్ణ విలాస సభ ఆధ్వర్యంలోని రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాల స్వామి తదితర ఆలయాల్లోనూ పూజలు జరిగాయి.

గుడిపాల: మండలంలోని కొత్తపల్లె, ముట్టుకూరుపల్లె, చెరువముందరూరు, గుడిపాల అరుధతివాడ, బట్టువాళ్లఊరు తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. జీజేఎం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు చెన్నకేశవులు నాయుడు, టీడీపీ నేతలు గోళ్లహేమాద్రినాయుడు, వెంకటేష్‌యాదవ్, అమరేంద్రబాబు పాల్గొన్నారు.



ముట్టుకూరుపల్లెలో జరిగిన వేడుకల్లో చెన్నకేశవులు

వేణుగోపాలస్వామి ఆలయంలో 19నుంచి పవిత్రోత్సవాలు

వెదురుకుప్పం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఈనెల 19వ తేదీనుంచి పవిత్రోత్సవాలు జరుగుతాయని టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్ శనివారం తెలిపారు. 19న ఉదయం ఆచార్య రుత్విక్‌వరణం, సాయంత్రం మృత్సంగ్రహణం, సేవాధిపతి, తిరువీధి ఉత్సవంతో పవిత్రోత్సవాలకు అంకురార్పణ జరుగుతుందన్నారు. 20వ తేదీన మూలవర్లకు తిరుమంజనం, మధ్యాహ్నం ఉత్సవర్లకు పవిత్రాల సమర్పణ ఉంటుందన్నారు. సాయంత్రం 5.30 నుంచి ఏడు గంటల వరకు స్వామివారిని పురవీధుల్లో తిరుచ్చి వాహనంపై ఊరేగిస్తారని పేర్కొన్నారు.

అన్నదానానికి 5 టన్నుల బియ్యం విరాళం



ఐరాల(కాణిపాకం), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదానానికి ఐదు టన్నుల బియ్యాన్ని తవణంపల్లె మండలం మైనగుండ్లపల్లెకు చెందిన అంజిరెడ్డి బృందం శనివారం విరాళంగా అందించింది. బియ్యంతోపాటు పప్పు, నూనె, కూరగాయలను అందజేశారు. దాతలను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో వారిని ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు.

భక్తులతో కిక్కిరిసిన కందగిరికొండ

గుడిపాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆడికృత్తికను పురస్కరించుకుని శనివారం కందగిరికొండ భక్తులతో కిక్కిరిసింది. కొండపై ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు కావళ్లను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే గురజాలజగన్మోహన్ దంపతులు స్వామిని దర్శించుకుని, భక్తులకు అన్నదానం చేశారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు పర్యవేక్షించారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, టీడీపీ నాయకులు శరత్, ప్రదీప్, చల్లా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

ద్రాక్ష లోడుతో వెళుతున్న మినీ లారీ బోల్తా

బంగారుపాళ్యం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగుళూరు జాతీయ రహదారి మొగిలి ఘాట్‌లో శనివారం ద్రాక్ష లోడుతో వెళుతున్న మినీ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలవలేదు. బెంగళూరు నుంచి కోల్‌కాతాకు ద్రాక్ష లోడుతో వెళుతున్న మినీ లారీ మొగిలి ఘాట్‌కు చేరుకోగానే అదుపుతప్పి బోల్తా పడింది. వాహనంలోని ద్రాక్ష పండ్లన్నీ రోడ్డుపై పడ్డాయి. ఈ పండ్లను తీసుకోవడానికి జనం ఎగబడ్డారు. సీఐ శ్రీనివాసులు సంఘటన స్థలానికి చేరుకుని జనాన్ని అదుపు చేసి, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.



రోడ్డుపై పడ్డ ద్రాక్ష పండ్లను ఏరుకుంటున్న జనం

చంద్రబాబుకు మహిళల కృతజ్ఞతలు



నగరి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం కింద ఆర్టీసీలో ఉచిత బస్సుప్రయాణ సౌకర్యం కల్పించడంపై సీఎం చంద్రబాబుకు తెలుగు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఒకటో వార్డు మాజీ కౌన్సిలర్ లత, టీడీపీ నాయకుడు రామానుజం చలపతి ఆధ్వర్యంలో సామాలమ్మ గుడి వద్ద జరిగిన కార్యక్రమంలో అలిమేలు, భారతి, రాధ, లక్ష్మమ్మ, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

నగరి టీడీపీ అధ్యక్షుడికి సన్మానం



నగరి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నగరి టీడీపీ అధ్యక్షుడిగా ఎంపికైన జి.గుణశేఖర్‌ను శనివారం సన్మానించారు. టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో 25, 26 వార్డుల టీడీపీ నాయకులు జ్యోతినాయుడు, మనోహర్‌నాయుడు, సదాశివరెడ్డి, గిరి మందడి, కుప్పయ్యశెట్టి, అడ్వొకెట్ సోమసుందరం, వెంకటముని, గోపాల్‌మేస్త్రి, జనసేన నాయకురాలు కోమల తదితరులు పాల్గొన్నారు.

పల్లకీపై సంతాన వేణుగోపాలుడి విహారం

గంగాధరనెల్లూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మహదేవమంగళం సమీపంలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా అభిషేకం, ఊంజల్‌సేవను శనివారం వైభవంగా నిర్వహించారు. అలాగే స్వామిని పల్లకీపై అధిష్ఠింపజేసి ఊరేగించారు. భక్తులకు ఆలయ ధర్మకర్త, బెంగళూరుకు చెందిన ఆంజినేయులురెడ్డి అన్నదానం చేశారు. అనంతరం ఆలయం ముందు ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు బలరామిరెడ్డి, లోకనాథరెడ్డి, అర్చకులు జగన్నాథం, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు



కావళ్లతో మెట్లెక్కుతున్న భక్తులు

కుమారగిరి కొండపై భక్తుల రద్దీ

వెదురుకుప్పం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): : కార్వేటినగరంలోని కుమారగిరి కొండపై ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆడికృత్తిక సందర్భంగా శనివారం భక్తుల రద్దీ నెలకొంది. పలువురు కావళ్ల సమర్పించి, మొక్కు చెల్లించుకున్నారు. కార్వేటినగరానికి చెందిన మునిప్రసాద్.. లడ్లు వితరణ చేశారు. ఏర్పాట్లను ఈవో కృష్ణనాయక్ పర్యవేక్షించారు. కాగా, సాయంత్రం పద్మసరస్సు ఎస్టీ కాలనీవాసులు అమ్మవారికి ప్రత్యేకంగా సారెను తీసుకొచ్చారు. రాత్రి స్కంద పుష్కరిణిలో స్వామి తెప్పోత్సవం జరిగింది.



సారెను తీసుకొస్తున్న పద్మసరస్సు ఎస్టీకాలనీవాసులు

హరోం.. హర..!

భక్తిశ్రద్ధలతో ఆడికృత్తిక పూజలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆడికృత్తిక సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయాలన్నీ శనివారం హరోం.. హర నామస్మరణతో మార్మోగాయి. గిరింపేట చెంగల్రాయకొండపై ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో పూజలను ఈవో వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అర్చకుడు పద్మనాభ గురుకుల్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి కాణిపాక వరసిద్ధి వినాయక ఆలయం తరఫున పట్టువస్త్రాలను సూపరింటెండెంట్ కోదండపాణి, అర్చక బృందం సమర్పించింది. మరోవైపు కావళ్ల సమర్పించిన భక్తులతో కొండ కిటకిటలాడింది. బజారువీధిలోని శివ షణ్ముగ సుందర వినాయక ఆలయంలో పూజలను ఈవో వెంకట్రాయలు ఆధ్వర్యంలో నిర్వహించారు. పూజల్లో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పాల్గొనగా.. పాలక మండలి చైర్మన్ కణ్ణన్ స్వాగతం పలికారు.



తవణంపల్లె: మండలంలోని అరగొండ స్వయం భువనేశ్వర, తవణంపల్లె సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు కావిడి చెల్లింపులు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

పాలసముద్రం: మండలంలోని మఠవలంలోని సుబ్రహ్మణ్యస్వామి, బాలగురునాథీశ్వర ఆలయాలకు భక్తులు తరలివచ్చారు. స్వామివార్లకు పుష్ప కావళ్లను సమర్పించి, మొక్కు చెల్లించారు. ఇంకొందరు తిరుత్తణికి బయల్దేరారు.



చెంగల్రాయకొండపై భక్తుల సందడి (ఇన్‌సెట్లో) కాణిపాకం నుంచి వరసిద్ధుడి పట్టువస్త్రాలు తీసుకొచ్చిన సిబ్బంది

నింద్ర: ఆడికృత్తికను పురస్కరించుకుని నింద్రలో పేదలకు సుబ్రహ్మణ్య స్వామి భక్తులు అన్నదానం చేశారు. ఏటా ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.



ఎల్లసముద్రంలో శూలాలు గుచ్చుకున్న భక్తుడు

విజయపురం: మండలంలో తెల్లగుంట, జగన్నాథపురం, విజయపురం, పన్నూరు సబ్‌స్టేషన్, మాధవరం, పాతార్కాడు, ఎల్లసముద్రం, ఆలపాకం గ్రామాల్లో ఆడికృత్తిక ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. కావళ్ల తీసుకుని తిరుత్తణి, రామగిరి సుబ్రహ్మణ్యం స్వామిని దర్శించుకుని, మొక్కు చెల్లించారు.

తిరుత్తణికి తరలివెళ్లిన భక్తులు

నగరి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆడికృత్తిక సందర్భంగా నగరి పట్టణంలోని భక్తులు అధిక సంఖ్యలో కావళ్ల తీసుకుని తిరుత్తణి సుబ్రహ్మణ్య స్వామి గుడికి శనివారం తరలివెళ్లారు. హరోం.. హర.. నామస్మరణతో పురవీధులు మార్మోగాయి. మాజీ మంత్రి రోజా కూడా తన స్వగృహం నుంచి తిరుత్తణికి కావడి తీసుకెళ్లి, మొక్కు చెల్లించారు.



న్యూ గంగాకాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి

● ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యే జగన్మోహన్, కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కొండ ప్రాంతంలో 20 ఏళ్ల క్రితం ఇచ్చిన పట్టాలతో అరకొర వసతుల నడుమ ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్న న్యూ గంగా కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉపక్రమించారు. స్థానికుల విజ్ఞప్తితో ఇప్పటికే త్రీఫేస్ విద్యుత్ సౌకర్యాన్ని ఎమ్మెల్యే జగన్మోహన్ కల్పించారు. మిగిలిన సమస్యల పరిష్కారార్థం కాలనీని శనివారం ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి పర్యటించారు. స్థానికులు మాట్లాడుతూ.. తమకు సరైన రోడ్డు, నీటి వసతి లేదని, వీధి దీపాలు వెలగడం లేదన్నారు. కొండ ప్రాంతం కావడంతో రాత్రి వేళల్లో విష పురుగుల బెడద ఉంటోందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే, చుడా, కలెక్టర్ నిధులతో రోడ్డు వేయడానికి చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు నేతలు హామీ ఇచ్చారు. కమిషనర్ నరసింహప్రసాద్, మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

యాదవుల ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు



మోటార్ బైక్ ర్యాలీ (ఇన్‌సెట్లో) శ్రీకృష్ణుడికి విశేషపూజలు

నగరి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నగరి పట్టణంలోని ఏకాంబరకుప్పం నుంచి ఓంశక్తి ఆలయం వరకు యాదవుల ఆధ్వర్యంలో శనివారం భారీ మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓ కళ్యాణమండపంలో శ్రీకృష్ణుడికి విశేషపూజలు నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ వెంకటరత్నం, రామలింగం, నరేష్, వెంకటేష్, వరదరాజులు, చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

కనికలకొండకు పోటెత్తిన భక్తులు



కనికలకొండపై భక్తుల సందడి - సుబ్రహ్మణ్య స్వామి

పెనుమూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆడికృత్తిక సందర్భంగా పెనుమూరు కనికలకొండపై ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. అర్చకులు శివరామశర్మ, తారకరామశర్మ స్వామివారికి ఉదయమే అభిషేకాలు చేసి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులకు ప్రసాదాలను ఈశ్వర్‌ప్రసాద్ పంపిణీ చేయగా, ఏర్పాట్లను నిర్వాహకులు యాగమనాయుడు, కృష్ణమూర్తినాయుడు, శ్రీనివాసచౌదరి పర్యవేక్షించారు. ఎస్‌ఐ వెంకటరనరసింహులు బందోబస్తు నిర్వహించారు.

సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం

గంగాధరనెల్లూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఎట్టేరి, సిద్దేశ్వర కొండ గ్రామాల్లోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిశాయి. స్వామివారికి అభిషేకం చేయగా, భక్తులు కావళ్లు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.



స్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు

రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ

గంగాధరనెల్లూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి రాణిపేట సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైసీపీనేత సురేంద్రరెడ్డి కుటుంబీకులైన చిట్టెమ్మ, కీర్తి, రేఖలను శనివారం మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పరామర్శించారు. ఆయనతోపాటు తమిళనాడు షోలింగర్ మాజీ ఎమ్మెల్యే పార్తిబన్ కూడా ఉన్నారు.

కాళభైరవ స్వామికి పూజలు



పూజల్లో పాల్గొన్న వెంకటేశన్ తదితరులు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కామాక్షి అంబికా సమేత అగస్త్రీశ్వరాలయంలో కాళభైరవ స్వామికి కాళభైరవ ట్రస్టు ఆధ్వర్యంలో అష్టమి పూజలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను ట్రస్టు నిర్వాహకుడు టి.వెంకటేశన్ అందజేశారు. అర్చకుడు శివకుమార్ శివాచార్యులు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

చిత్తూరు అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోను గుర్తు చేస్తూ శనివారం ఇరువారంలో వైసీపీ నేతలు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఇన్‌చార్జి విజయానందరెడ్డి, కేవీ శ్రీధర్, జ్ఞాన జగదీశ్, డేవిడ్, జయకుమార్, అఫూన్, పొన్నువేలు, బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, రమేష్ సూరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించండి

గుడిపాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తమ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఎమ్మెల్యే జగన్మోహన్‌ను రెట్టగుంట గ్రామస్తులు కోరారు. శనివారం గ్రామానికి వచ్చిన ఆయనకు రోడ్డు పరిస్థితిని చూపించారు. రోడ్డంతా కోసుకుపోయిందని చెప్పారు. మరమ్మతులు చేయిస్తామని ఎమ్మెల్యే చెప్పడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



ఉత్తమ సేవలకు ప్రశంస

ఉత్తమ సేవలకుగాను చిత్తూరులో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో మంత్రి సత్యకుమార్, కలెక్టర్ సుమిత్‌కుమార్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న నగరిలోని భవిత పాఠశాల టీచర్ భవిత - విద్యాశాఖ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్లు ఎన్.గోపాల్ - కె.సాయిప్రశాంతి - బి.చైతన్య - గంగాధరనెల్లూరు విద్యుత్‌శాఖ ఏడీ శేషాద్రిరెడ్డి



ప్రజల సంతోషమే ప్రభుత్వ లక్ష్యం

● ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్

చిత్తూరు సిటీ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంతోషమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. బంగారుపాళ్యం మండలం తుంబ గ్రామ పంచాయతీలో 30 ఏళ్లుగా రిజర్వు ఫారెస్టులో 45 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తుంబ కొత్త చెరువులో చేపలు పట్టుకుని జీవించే యానాదులకు, అటవీశాఖ అధికారులకు ఉన్న సమస్య ఎంపీ, ఎమ్మెల్యే సహకారంతో పరిష్కారమైంది. చెరువులో చేపలు పట్టుకుని జీవనం సాగించడానికి కలెక్టర్ మంజూరు చేసిన షెడ్యూల్డు తెగలు, సంప్రదాయ అటవీ నివాసితులకు చేపల ఫలసాయం హక్కు పత్రాలను ఎంపీ, ఎమ్మెల్యేలు తమ కార్యాలయాల్లో వేర్వేరుగా అందించారు. సుమారు 50 యానాది కుటుంబాల వారికి ఈ హక్కుపత్రాలను అందించారు. వారు మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలనకు సీఎం చంద్రబాబు ప్రత్యేక కృషి చేస్తున్నారని ప్రశంసించారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండయాప్, బంగారుపాళ్యం మండల పార్టీ అధ్యక్షుడు ధరణి ప్రసాద్, తుంబ గ్రామ సర్పంచ్ ఉషశ్రీ, ఉప సర్పంచ్ చిరంజీవి, తుంబ కొత్త చెరువు నీటి సంఘం చైర్మన్ మురళీమోహన్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మూర్తి, యానాదాల సంఘ నేతలు పాల్గొన్నారు.



యానాదులకు హక్కు పత్రాలను అందిస్తున్న ఎంపీ ప్రసాదరావు

సంక్షిప్తంగా..

వరసిద్ధుడి సేవలో ఖాదీ బోర్డు చైర్మన్



ఐరాల(కాణిపాకం), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఖాదీ బోర్డు చైర్మన్ కేకే చౌదరి శనివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రూ.2లక్షల విరాళం: వరసిద్ధుడి అన్నదాన కార్యక్రమానికి రూ.లక్షను శ్రీకాళహస్తికి చెందిన మహేష్, గోసంరక్షణ ట్రస్టుకు రూ.1,00,116లను శ్రీకాకుళానికి చెందిన కిషోర్‌కుమార్ అందించారు. దాతలకు ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి తదితరులు స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ

వెదురుకుప్పం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణంలో శనివారం భక్తులకు భగవద్గీత పుస్తకాలను తిరుపతికి చెందిన సుకలా గిరి జమ్మ, సుబ్రహ్మణ్యం, కంచి త్యాగరాజు, కంచి మోహన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బంగారమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పేటి ప్రసాద్, టీటీడీ ఏఈవో రవికుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

వన వేణుగోపాలుడికి పూజలు



వెదురుకుప్పం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి కృష్ణాష్టమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఏర్పాట్లను ఆలయ ప్రధాన కార్యనిర్వాహకుడు శివకుమార్ పర్యవేక్షించారు.

తవణంపల్లె: మండలంలోని జొన్నగురకల, మత్యం పైపల్లె, మోట్టుకూరు, కాణిపాకపట్నం, జి.గొల్లపల్లె, అరగొండ గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు.

పాలసముద్రం: పాలసముద్రం, రాచపాళ్యం, ఎస్ఆర్‌ఆర్‌కండ్రిగ, తిరుమలరాజుపురం, బాలకృష్ణాపురం, టీవీఎన్ఆర్‌పురం, నరసింహాపురం గ్రామాల్లోని శ్రీకృష్ణ భజన మందిరాలు, ఆలయాల్లో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు.

విజయపురం: మండలంలోని పాతార్కాడు, తెల్లగుంట, జగన్నాథపురంలో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. సాయంత్రం ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో కృష్ణాష్టమి

శ్రీరంగరాజపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సింధురాజపురంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ బాలాజీ నాయుడు, కమిటీ సభ్యులు రమేష్ నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, అంజనేయులు నాయుడు, మాధవ నాయుడు పాల్గొన్నారు. కాగా, ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఆరిమాకులపల్లెలో సర్పంచ్ దాము నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి